బడుగువర్గాలవారు తమ సంతానం అభివృద్ధిలోకి రావాలంటే విద్య ప్రాముఖ్యత గ్రహించి కష్టపడాలి. అవసరమైతే త్యాగాలు చేయాలి. చదువుకోవాలన్న ఆత్మస్థైర్యం సంతానం కూడా అలవర్చుకోవాలి. అప్పుడు విజయం తథ్యమనే సత్యం 'రాగ్స్ లోరిచెస్' తరహాలో దర్శనమౌతుంది.

# దేముడి కొడుకు

పంచాంగం దేముడు పెరిగి పెద్దవాడై పెళ్ళి చేసుకున్నాడు. 'పేట'లో చదువుకున్న పిల్ల ఉందంటే ఏరి కోరి తెచ్చుకుని మరీ పెళ్ళి చేసుకున్నాడు. అన్యోన్యమైన దాంపత్యంలో పండంటి బిడ్డడిని ప్రసాదించింది భార్య నాగమ్మ. కొత్తగా ఉంటుందని 'నరేష్' అని పేరు పెట్టుకున్నాడు కొడుక్కి దేముడు.

పెరిగిపోతున్న జనారణ్యంలో దుర్భరమౌతున్న బ్రతుకు భారాన్ని మోయడం కష్టమని తెలిసిన దేముడు, దేశం కోసం కాకపోయినా, తన కుటుంబ భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకుని 'ఒక్కరి కంటె ఎక్కువెందుకు?' అన్న సూత్రాన్ని ఆధారం చేసుకుని కుటుంబ నియంత్రణ ఆపరేషను చేయించుకున్నాడు. చదువుల విలువలు తెలిసిన భార్యాభర్త లిరువురూ, కూలీ, నాలీ చేస్తూ నరేష్‌ని చదువులో పెట్టారు. గునుపూడి బడిలోది ఎంత వానాకాలం చదువైనా, ఇంటి దగ్గర పునాది గట్టిదవడంతో, నరేష్ చదువు ప్రారంభదశలో ఓ మోస్తరు బాగనే నడిచింది. అభివృద్ధి కార్యక్రమాల పుణ్యమా అని గునుపూడిలోనే హైస్కూలు కూడా వెలిసింది కాబట్టి నరేష్ హైస్కూల్లో ప్రవేశించాడు. ఊళ్ళో పంచాంగం దేముడు ఇంకా అంటరానివాడుగానే ఉన్నప్పటికీ, మారుతున్న రాజకీయాలు, సాంఘిక పరిస్థితుల్లో, వెనుక బడిన వారికున్న ప్రత్యేకతనిబట్టి, నరేష్ హైస్కూల్లో మోతుబరుల పిల్లల్తో బాటు బెంచీ మీద కూర్చుని చదువుకుంటున్నాడు. చదువులో అందర్నీ మించిన వాడవడంతో, నరేష్‌కి అంటరానితనం అడ్డురాలేదు.

కష్టాల్లో నిముషాలు యుగాలుగా గడుస్తాయంటారు. కానీ, సాఫీగా సాగిపోయే జీవన యాత్రలో యుగాలే నిముషాలుగా గడిచిపోతాయి. చూస్తూండగానే నరేష్ హైస్కూలు చదువు మంచి మార్కులతో పూర్తి చేశాడు. వేగం పుంజుకున్న బండిలో ప్రయాణం హాయిగా ఉంటుంది. ఆ గతికి అవరోధం కల్పించడానికి ఎవరూ ఇష్టపడరు. నరేష్ చదువుకోవాలే గాని ఎంత బరువైనా చెప్పించగల మానసిక బలం ఉంది దేముడిలో ఇప్పుడు. ముందు కార్యక్రమం అతనికి తేట తెల్లంగా కనిపిస్తోంది.

ఎవరి సలహా, సహకారాలూ అక్కర్లేకుండానే 'తుని'కి మకాం మార్చాడు దేముడు. కొడుకుని జూనియర్ కాలేజీలో జాయిను చేశాడు. నరేష్‌కి చదువులో ముందుకి చొచ్చుకుపోవడం తప్ప మరే బాధ్యతా లేదు. దానికి కావలసిన దోహదం చేయడం మాత్రమే దేముడి పని. పల్లెటూరి నుంచి వచ్చినా, పట్నవాసపు అవసరాలు అర్థం చేసుకోలేనివాడు కాదు దేముడు. అప్పట్లో తునిలో కొత్తగా నీటి సరఫరా కార్యక్రమం మొదలైంది. కష్టపడి పని చేయగలిగిన వారికి చేతి నిండా పని దొరుకుతోంది. ఇద్దరు ముగ్గురు స్త్రీల వెంట తిరిగి, పైపులు బిగించడం, కుళాయిలు రిపేరు చేయడం నేర్చుకున్నాడు. నాలుగు రాళ్ళు వెనకేసుకుని రిపేరుకు కావలసిన పనిముట్లు కొనుక్కున్నాడు. కష్టపడి పనిచేసే వారిని భగవంతుడు ఆదరిస్తాడని చెబుతారు. తను చదువుకోడానికి లేని అవకాశం ఇప్పుడు తన కొడుక్కి వచ్చింది. ఎట్టి పరిస్థితుల్లోనూ అది కుంటుపడడానికి వీల్లేదు. అందుకెంతటి త్యాగమైనా చేయాలి తను. తన జీవితాశయం, తన కొడుకు ద్వారా నెరవేరాలి. అదే అతని ధ్యేయం. నాగమ్మ కూడా ఊరికే కూర్చోకుండా, వేన్నీళ్ళకి చన్నీళ్ళు తోడు అన్నట్టు ఒకటి రెండిళ్ళలో కూలి పని కుదుర్చుకుంది. పట్నంలో, అంటరాని తనం కంటే అవసరం ముఖ్యం కనుక 'అది' అడ్డురాదు మరి. ఏతావాతా, నరేష్ చదువు మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉంది. కొంచెం అవగాహన వచ్చినవాడవడంతో, తన చదువు విషయంలో తల్లిదండ్రుల దీక్షను అర్థం చేసుకుని, నరేష్ చదువుని నిర్లక్ష్యం చేయలేదు. ఈ రెండేళ్ళూ దేముడూ, నాగమ్మా ఏం తిన్నారో, ఎప్పుడు విశ్రమించారో దేముడి కెరుక. ఇంటరు ఫలితం మాత్రం వారి కపరిమితానందాన్నిచ్చింది. నరేష్ ఆ సంవత్సరం ఇంటరులో స్టేట్ ఫస్టు వచ్చాడు. ఇది నాంది.

"సక్సెస్ హేజ్ మెనీ ఫాదర్స్" అంటారు. నరేష్‌కి ఆ ప్రాంతం వారంతా బ్రహ్మరథం పట్టేశారు. "మావాడు" అని గర్వంగా చెప్పుకున్నారు. అక్కడికివారే దగ్గరుండి చదువు చెప్పించేసినట్టు! ఆ నియోజక వర్గం ఎం.ఎల్.ఏ నరేష్‌ని తన స్వంత బాధ్యత మీద హైద్రాబాదులో మంచి కాలేజీలో చేర్పించే ఏర్పాటు చేశాడు. ఎలాగూ వెనుకబడిన జాతుల వారి రిజర్వేషన్ల ద్వారా, ఏ ఖర్చూ లేకుండా వాడి చదువు పూర్తవుతుంది. ఆ గౌరవం మాత్రం తనకు దక్కుతుంది గనుక. ఇది ప్రస్తావన.

ఇక్కడ మలుపు తిరిగిన నరేష్ జీవనరథం, మట్టి రోడ్లు దాటి, స్టేట్ హైవేస్ మీద ప్రయాణిస్తూ వేగం పుంజుకుంది. హైద్రాబాద్ కాలేజీలో తన జీవిత ప్రథమాంకంలో రంగ ప్రవేశం చేసిన నరేష్ మొదట్లోనే తన పాత్రని క్షుణ్ణంగా అర్థం చేసుకుని రక్తి కట్టించసాగాడు. అతని ధ్యేయం ఒక్కటే - విజయ సాధన! అది ఎంత కఠినమైనా సరే!

"చదువుకో బాబూ! నువ్వు చదువుకుంటే నన్ను నేను అమ్మేసుకునైనా నిన్ను చదివిస్తాను. నువ్వు చదువుకుని పెద్ద ఉద్యోగం చేస్తే చూడాలని ఉంది" అన్న తండ్రి సంతృప్తి కోసమైనా తను చదువుకోవాలి. అయితే అది కేవలం కాలేజీ డిగ్రీకే పరిమితమా? కానేకాదు! తను ఐ.ఏ.ఎస్. చదువాలి. కనీసం కలెక్టరైనా కాకపోతే తన తండ్రి పడిన కష్టాలకి ఫలితం దక్కదు. దళిత జనోద్ధరణ కోసం ప్రభుత్వం రకరకాల కార్యక్రమాల్ని చేపట్టుతోంది.

ఉచితంగా ఐ.ఏ.ఎస్. కి శిక్షణ ఇచ్చే పథకాన్ని వినియోగించుకుంటున్నాడు నరేష్, డిగ్రీ పూర్తయి సంవత్సరం తిరిగేసరికి ఐ.ఏ.ఎస్. కి ఎంట్రన్సు పాసయ్యాడు. అదృష్టం రోజూ వచ్చి తలుపు తట్టదు. వచ్చిన అదను చేజారిపోతే మళ్ళీ ఎప్పుడొస్తుందో తెలియదు. అసలు వస్తుందో లేదో కూడా! ఆర్థికంగా అంత బలం లేకపోయినప్పటికీ గుడ్డిగా ఓ దూకు దూకాడు నరేష్. ఐ.ఏ.ఎస్ లో ఆంధ్రప్రదేశ్ కేడరుకి సెలక్టు అయ్యాడు. ఇప్పుడు రథం స్టేట్ హైవేస్ దాటి నేషనల్ హైవేస్‌లో ప్రవేశించింది. పంచాగం దేముడి జీవిత లక్ష్యం నెరవేరింది. ప్రపంచంలో తనని మించిన అదృష్టజాతకుడు లేడని మురిసిపోయాడు. నరేష్ బాబు విశాఖపట్నం జిల్లాకి కలెక్టరయ్యాడు. గునుపూడి విశాఖ జిల్లానే ఉంది.

* * *

జిల్లా కలెక్టరుగారు కేంపుకి వస్తున్నారన్న వార్త గునుపూడి ఊళ్ళో గుప్పున వ్యాపించింది. మరి నరేష్ బాబుది ఆ వూరే! ఊరంతా సంక్రాంతి పండగొచ్చినంత సంబరంగా ఉంది. రెండు రోజుల ముందు నుంచీ జీపుల్లో ఆఫీసర్లూ, బంట్రోతులూ ఎడతెరిపి లేకుండా తిరుగుతున్నారు. ఊరంతా సందుగొందుల దగ్గర్నుంచీ శుభ్రం చేయిస్తున్నారు. కుళ్ళు కంపు కొట్టకుండా మందు జల్లిస్తున్నారు. ఎప్పుడూ కుర్చీ దిగని రెవెన్యూ ఆఫీసర్లు కూరల బుట్టల దగ్గర్నుంచీ మోసేస్తున్నారు. ఊరి పెద్ద బుగత గారింట్లో బస ఏర్పాటైంది. ఇంటికి క్రొత్తగా సున్నం వేయించారు. ఎలాగైతేనేం ఆ రోజు నాటికి గునుపూడి కొత్త పెళ్ళి కూతురులా ముస్తాబైంది.

బొంకుల దిబ్బ దగ్గర సాయంకాలం ఉబుకుసోకకి చేరే వాళ్ళకి మాట్లాడుకోడానికి కావలసినంత మసాలా దొరికింది. ఆ వూళ్ళో చాలామంది పెద్ద వయసు వాళ్ళకి ఆ కుర్రాడు చిన్నప్పుడు దిసమొలతో, చీమిడి ముక్కుతో తిరిగే 'నర్సిగాడు' గానే తెలిసును.

"కలట్రంటే మన పంచాంగం దేముడి కొడుకు నర్సిగాడు కలట్రయ్యేడన్నారు. ఆడేనా?" అడిగాడొక పెద్దాయన.

"ఆఁ! ఆడే! కాని అక్కడికెల్లి ఆడూ, ఈడూ అనేవు గాక! టాపు లేసిపోద్ది" - ఒక సమాధానం.

"పోలీసులు చుట్టూతా కాసేత్తారు. మనం ఆ దరిదాపులకే ఎల్లలేం!" - మరొకాయన.

"ఎవుడయితేనేం? ఈయాల కలట్రయ్యేడు. నువ్వయేవా? నేనయేనా? ఆడయేడు. ఆడు మనూరోడు. మన మనిషి. అంచేత మన కట్టమూ సుకమూ సూత్తాడు" - ఇంకొకరు.

"సూడ్డేటి? మనూరికి రోడ్లు, ఆసుపత్రీ వొత్తాయంటున్నారు. పుట్టి పెరిగిన ఊరు ఆ మాత్రం అభిమానం ఉండొద్దూ!" ఇంకొక ఆశవాది.

"అవును మరీ! బుగతవారి కుటుంబానికి శానా ఆసారం గందా! ఆరింటో ఈడికి బస, బోయినం ఏర్పాటు సేసేరు. అయితే మడి అంతా గుడికెల్లినట్టేనా?" - ఒకరి సందేహం.

"అధికారం ముందు ఆసారా ఎక్కడ నిలబడుద్దోయ్, ఎర్రిమొకమా! సూట్టం నేదా? తాసీల్దారు కాడి నుంచి, ఊరకుక్కల్లా తోకలు ముడిసి తిరిగేత్తన్నారు నాల్రోజుల్నుంచీ".

"ఒకప్పుడు ఆరింట్లో ఈలు అడుగెడితే తోమి కడుక్కునీ వోరు. ఇయ్యాల ఈడు తిని వొదిలేసిన అంట్లు తోమడానికి వెనుకాడరు సూడు!"

ఇలా అర్ధరాత్రి సద్దుమణిగే వరకు సంభాషణలు వినబడుతూనే ఉన్నాయి.

మర్నాడు ఉదయం.....

సూర్యకాంతికి అడ్డుగా నుదుటి మీద చెయ్యి పెట్టుకుని తూర్పుగా తిరిగి కారు కోసం ఎదురు చూస్తున్నారు ఎందరో!

మట్టి రోడ్డు మీద దూరాన రేగిన ధూళిని పసిగట్టి ఎవరో అన్నారు.

"కారొచ్చేత్తన్నాది"

"కలట్రుగారొచ్చేత్తన్నారు!"

ఆ మాట విని జనం ప్రవాహంలా వీధుల్లో కొచ్చారు, కారులో వచ్చే కలెక్టరుగార్ని చూడడానికి.

సర్రున దూసుకుంటూ వచ్చింది కారు. తెల్లటి కారుపైన ఎర్రటి ధూళి! అంతా మట్టికొట్టుకుపోయింది. ధూళి లోపలికి రాకుండా అద్దాలు ఎత్తేశారు. లోపలివారు, బైటివారినేగాని, బైటివారు లోపలివారిని చూడలేని 'మాయ' అద్దాలు అవి. చాలామంది కారుని చూసి తృప్తి చెంది వెళ్ళిపోయారు. కారు తిన్నగా వెళ్ళి బుగతగారి బంగళా ముందు ఆగింది. ఈలోగా వెనక జీపుల్లో సిబ్బంది దిగారు. కలక్టరుగారి కారులో ఆయనే కాక మరొక ముసలాయన కూడా ఉన్నాడు. అతను పంచాంగం దేముడు.

గతుకుల రోడ్డు మీద ప్రయాణం చేసి అలిసిపోయిన కలెక్టరుగారిని పట్నం వాసం నుంచి ప్రత్యేకంగా తెప్పించిన సోఫా మీద దిండ్లు వేసి కూర్చోబెట్టారు. ఊళ్ళోని మోతుబరు లంతా చుట్టూ చేరారు. కలెక్టరుగారితో బాటు, సిబ్బంది అందరికీ కూడా చల్లటి కొబ్బరికాయల నీళ్ళు తాగించారు. కొంచెం సేపు సేద దీరాక మీటింగు ప్రారంభం అయింది.

ఎందరో మహజర్లు, విన్నపాలు, విజ్ఞాపనలు తీసుకొచ్చి సమర్పించుకుంటున్నారు. జిల్లాలోని జనమంతా కలెక్టరుగార్ని చూడడానికి వచ్చేశారు. కరువొచ్చి పడిందనీ, పన్నులు కట్టలేమనీ, మాకు భూములిప్పించమనీ, మంచి నీళ్ళ సదుపాయం చేయించమనీ, రోగాలతో బాధపడుతున్నాం ఆసుపత్రి కట్టించమనీ, చాలామంది ముందుకు తోసుకొచ్చి అర్జీలు ఇస్తున్నారు. వారందర్నీ అదుపులో పెట్టలేక పోలీసులు సతమత మౌతున్నారు. ప్రజలు, పెద్దా, చిన్నా అనకుండా నరేష్ కాళ్ళ మీద పడి మొక్కేస్తున్నారు. ఎంతటి అమాయకులీ ప్రజలు! ఎంత లేమి ఉందీ దేశంలో ఇంకా! ఎన్ని కష్టాలు వీళ్ళకి! తానెంత తెగించి ప్రయత్నించినా ఒక మానవుడి జీవిత కాలంలో వీళ్ళ సమస్యలు తీరేనా? ఈ ప్రగతి సాధ్యమా? తనూ అందులోనే పుట్టి పెరిగిన వాడవడంతో నరేష్ బాబుకి ఇదంతా చూస్తుంటే చదివిన కథనే తిరిగి చదువుతున్నట్టనిపిస్తోంది.

కాఫీ తాగుతూనే, టిఫిను తింటూనే, భోజనం చేస్తూనే అందరి విన్నపాలూ వింటున్నాడు. కొందర్ని సముదాయిస్తున్నాడు. అప్పటికప్పుడు కొన్ని ఆర్డర్లువేస్తున్నాడు. అపరాహ్ణం తిరిగింది. తిరిగి వెళ్ళవలసిన సమయం సమీపిస్తోంది. సాయంత్రానికల్లా ఈ గతుకుల రోడ్డు దాటి తుని చేరుకోవాలి. తెల్లారితే వైజాగులో మినిష్టరు కేంపు ఉంది. ఏమైనా తేడా జరిగితే ట్రాన్స్‌ఫర్ ఖాయం. వాడసలే చండశాసనుడు. ఈ రాజకీయ నాయకులతో వ్యవహారం కత్తి మీద సాము వంటిది. వెంటనే బయల్దేరమని సిబ్బందికి ఆర్డరిచ్చాడు.

ఈలోగా పంచాంగం దేముడు ఊరంతా కాలినడకన గడగబా తిరిగేశాడు. చాలామంది తెలిసినవాళ్ళని కలిసి మాట్లాడాడు. కొందరు 'కలెక్టరు తండ్రి' అని దూరంగా ఉండబోతే ఎబ్బెట్టుగా ఫీలయ్యాడు. తను పుట్టి, పెరిగి, తిరిగిన స్థలాలన్నీ ఓసారి చెమర్చిన కళ్ళతో చూసుకున్నాడు. అవన్నీ చూస్తుంటే ఎందుకో అమ్మని చూసినట్టనిపించింది పంచాంగం దేముడికి. మాలపేటలో ఒకరిద్దరు పెంకుటిళ్ళు వేసుకున్నారు. కొన్ని గుడిసెలు వాసాల ఇళ్ళయ్యాయి. కాని ఇంకా లేమి రాజ్యం చేస్తోంది. ఉత్తరంగా ఆచార్లుగారిళ్ళవైపు వెళ్లాడు. ఒకనాటి వైభవం, కాంతీ లేవు ఆ ఇళ్ళలో. అన్నీ శిథిలాలయాల్లా ఉన్నాయి. కుటుంబాలన్నీ చితికి పోయాయని తెలిసింది. కొందరు చిన్నా చితకా ఉద్యోగాలకి, తునీ, నర్సీపట్నం వలసపోయారనీ, మిగిలినవారు ఉన్ననాడు తినీ, లేనినాడు పస్తులుండీ, ఇక్కడే కాలక్షేపం చేస్తున్నారనీ చెప్పారు. 'అయ్యో' అనిపించింది దేముడికి. తనేం చేయగలడు? కాలాని కెదురీదగలడా?!

నరేష్ బాబు కలెక్టరుగా ఉన్నంత కాలం విశాఖ జిల్లాని ముద్దుబిడ్డగా చూసుకున్నాడు. ఎన్నో అభివృద్ధి పథకాలు అమలు పరిచాడు. దేముడి కొడుకు నిజంగా దేముడే అనిపించు కున్నాడు. గునుపూడికి రోడ్లు, బస్సులు ఆసుపత్రి అన్నీ వచ్చాయి. ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడం కోసం చేపట్టిన 'తాండవ రిజర్వాయరు' కట్టడం పని చాలా వరకు అతని హయాంలో రాజకీయ పద్మ వ్యూహం ఛేదించుకుని సాఫీగా సాగింది.

ఆ రోజుల్లోనే అతనో పెద్దింటి పిల్లను పెళ్ళి చేసుకున్నాడు. దానికి తండ్రి అడ్డు చెప్పలేదు. బాధ్యత గల కొడుకు స్వవిషయాల్లో జోక్యం కలుగ జేసుకోదలచలేదు దేముడు. ఇప్పుడు వారి కులం గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. నరేష్‌బాబుకి ఇద్దరు పిల్లలు పుట్టారు. ఒక మగ, ఒక ఆడ. మగ పిల్లవాడిని 'విక్రమ్' అని పేరు పెట్టారు. పిల్ల పేరు కళ్యాణి.

కాలం చక్రం కాబట్టి తిరుగుతూ ఉంటుంది. తిరుగుతూ, తిరుగుతూ చుట్టూ ఉన్న మనుషుల జీవితాన్ని కూడా మార్చేస్తూ ఉంటుంది. ప్రభుత్వంలో సెక్రటరీగా హైద్రాబాదు మకాం మార్చవలసి వచ్చింది. హైద్రాబాద్‌లో పంచాంగం దేముడికి మనమలతో హాయిగా కాలం గడిచిపోతోంది.

✷